మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

28.3.2026 శనివారం Saturday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 337 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


**19వ సీజన్‌కు రంగం సిద్ధం**
నేటి నుంచే ఐపీఎల్-2026




సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




# కమనీయం.. సీతారామ కళ్యాణం

మిథిలా మండపంలో కన్నుల పండువగా కళ్యాణోత్సవం

పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు

రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు

పలువురు మంత్రులు, ప్రముఖుల రాక

02



శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

- జనతా న్యూస్

# టీమిండియా స్ఫూర్తితో ఎదుర్కొందాం

## ఇబ్బందుల్లేకుండా ముందుకు సాగాలి

ధరలు పెంచకుండా చర్యలు చేపట్టాం

కృత్రిమ మార్కెట్ లేకుండా చూడాలి

అన్ని రాష్ట్రాల సీఎంలకు ప్రధాని సూచన

పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దిశానిర్దేశం

కేంద్రం చర్యలను వివరించిన మోడీ

వర్చువల్ సమావేశానికి సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు, యోగి ఆదిత్యనాథ్, భగవంత్ మాన్, భూపేంద్ర పటేల్, ఒమర్ అబ్దుల్లాతో పాటు పలువురు హాజరు

రాష్ట్రాల్లో పరిస్థితులను వివరించిన ముఖ్యమంత్రులు

04



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో టీమ్ ఇండియా స్ఫూర్తితో ముందుకు సాగుదామని ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల సీఎంలకు సూచించారు. టీమ్ ఇండియా స్ఫూర్తితో ప్రయత్నాలలో సమన్వయం సాధించడమే ఈ వర్చువల్ సమావేశం లక్ష్యమని సమావేశంలో వెల్లడించారు.

## కొరత లేదు.. సమీక్షిస్తున్నాం

గ్యాస్, పెట్రో ఉత్పత్తుల సరఫరా సజావుగా సాగుతోంది

రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోనూ కమిటీలను ఏర్పాటు చేశాం

ప్రధాని మోడీతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

02



04

## పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం

పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం

పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ

పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

## దేశంలో ఎరువుల కొరత లేదు

తగినన్ని నిల్వలు ఉన్నాయి

లోక్‌సభలో జెపి నడ్డా వెల్లడి



04

# లాక్ డౌన్ వట్టిమాటే!

వదంతులు నమ్మొద్దు

పెట్రోల్, డీజిల్ భారం మోపం

చమురు కంపెనీలపైనే భారం

అందుకే ఎక్సైజ్ సుంకం తగ్గింపు

ప్రపంచమంతటా పెరుగుదల

కేంద్రమంత్రులు నిర్మల, హర్దీప్ సింగ్

ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధ ప్రభావం భారత్ పై పడుతోంది. అక్కడి యుద్ధం నేపథ్యంలో నేత భారత్లో లాక్డౌన్ విధించబోతున్నారనే వదంతులు వ్యాపించాయి. వీటిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీస్పందిస్తూ.. దేశంలో మళ్లీ లాక్డౌన్ను విధించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



04



02

## మూడ్రోజుల్లో ఈదురు గాలుల వర్షం

తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక



04

## ఇరాన్‌పై దాడులు తీవ్రం

జనావాసాలపై దాడిలో 26మంది మృతి

# ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

25న పార్టీ పేరును, జెండాను, ఎజెండాను ప్రకటిస్తా

మేడ్చెల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా

శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వాయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు.

03



# మూడ్రోజుల్లో ఈదురు గాలుల వర్షం

## తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక

**హైదరాబాద్,మార్చి 27 :** వేసవి భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఉపశమనం కలిగించే వార్తను అందించింది. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుందని అంచనా వేసింది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణపై ప్రస్తుతం ఉన్న వాతావరణ ద్రోణి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మరఠ్వాడా నుంచి కర్ణాటక తీరం వరకు సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీని ఫలితంగా శుక్ర, శని, ఆదివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే.. ఈ ఉపశమనం తాత్కాలికమేనని, వచ్చే వారం నుంచి ఎండల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశం ఉందని, సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికం కావచ్చని అధికారులు వెల్లడించారు.

# కూలిన కల్యాణోత్సవ వేదిక

## ఎమ్మెల్యే వేములకు తృటిలో తప్పిన ప్రమాదం



**నల్లగొండ, మార్చి 27 :** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు తృటిలో ప్రమాదం తప్పింది. కేతేపల్లి మండలం బండపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదిక అకస్మాత్తుగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ఈ వేడుకల్లో పాల్గొని వెళ్లిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. సీతారాముల కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇలాంటి సమయంలో వేదిక కూలడంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ అపశృతి జరిగిందంటూ తీవ్రంగా విమర్శించారు.

# వరంగల్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**వరంగల్,మార్చి 27 :** కాజీపేట-వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35-40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఏపీ ఎక్స్‌ప్రెస్ కిందపడి మృతి చెందాడు. రైలు కింద పడటంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు క్రీమ్ కలర్ ఫార్మల్ ప్యాంట్, యాష్ / బ్లూ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. సుమారు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, ఎరుపు వర్ణం, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుడి చేతి పైన ఇంగ్లీష్ పచ్చబొట్టు తప్ప మరే ఇతర ఆధారాలు లభించలేదు. రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచి, దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు. 9701747014, 8712658627 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

# కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

## మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలి

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ,మార్చి 27 :** కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రధానంగా మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ మే-రకు సిజెఐ గతవారం 25 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీల భర్తీ విషయాన్ని, ధర్మాసనాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరముందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో మహిళా జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయవద్దని, ఖాళీ కానున్నాయని తెలిసిన వెంటనే వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జడ్జీలకు సూచించారు. న్యాయరంగంలోని మరింత మంది మహిళలు వచ్చేలా న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాల్సి వుందని మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. హైకోర్టు కొలీజియంలు జడ్జీల పదవుల భర్తీ కోసం ప్రతిభావంతులైన మహిళా జడ్జీలను మినహాయించకుండా, వారిని కేటాయించడం ఒక నిబంధనగా పరిగణించాలని అన్నారు. పదోన్నతి కోసం తమ పరిశీలన పరిధిని విస్తృతం చేయాలని, తమ రాష్ట్రాల్లో్ని, సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవ్యాదులను కూడా చేర్చుకోవాలని హైకోర్టు జడ్జీలకు సూచించారు. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో పలువురు మహిళలు ప్రధాన జడ్జీలుగా విధులు నిర్వహిస్తున్నారని, పంజాబ్, హర్యానా హైకోర్టులో 18మంది మహిళా జడ్జీలు ఉన్నారని పేర్కొన్నారు. మద్రాస్, ముంబయి హైకోర్టుల్లో కూడా సుమారు 12మంది మహిళా జడ్జిలు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో మహిళలు సుమారు 36.3శాతం ఉన్నారని సిజెఐ పేర్కొన్నారు. ఇది ఒక సాధారణ గణాంకం కాదని, ఇది తరాల మార్పును ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యవస్థ పునాదిలోనే ఎక్కువ మహిళా భాగస్వామ్యం ఉన్నప్పుడు, అది అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా త్వరలోనే ప్రతిబింబిస్తుందని అన్నారు.

# కమనీయం.. సీతారామ కల్యాణం

## మిథిలా మండపంలో కన్నుల పడువగా కల్యాణోత్సవం

## పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు

## రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు

## పలవురు మంత్రులు, ప్రముఖుల రాక



**భద్రాచలం,మార్చి 27 :** శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.



### తిరుమలలో సీతారాములకు స్నపన తిరుమంజనం

**తిరుమల :** శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుమలలోని శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్ర స్వామి ఉత్సవమూర్తులకు, స్నపన తిరుమంజనం నిర్వహించారు.శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలోని ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులకు కన్నుల పండుగగా స్నపన తిరుమంజనం జరిగింది. తిరుమల పెద్ద జీయర్ స్వామి, టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొరత లేదు.. సమీక్షిస్తున్నాం

## గ్యాస్, పెట్రో ఉత్పత్తుల సరఫరా సజావుగా సాగుతోంది

## రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోనూ కమిటీలను ఏర్పాటు చేశాం

## ప్రధాని మోడీతో వీడియో కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ :** పెట్రోల్ డీజిల్, గ్యాస్ సరఫరాకు సంబంధించి సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పరిస్థితుల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వం-చ్యువల్ వీడియో కాన్ఫరెన్స్లో సీఎం రేవంత్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. తమ రాష్ట్రంలో 38 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్రయాలు.. బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు సీఎం తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను పంపుతున్నట్లు సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి బంక్లో స్టాక్ ఎంత ఉంది...? ఎంత వినియోగిస్తున్నారనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం అవుతోందని చెప్పారు. ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సీఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి ప్రధానికి వివరించారు. కృత్రిక కొరత ఊహాగానాలపై క్షేత్రస్థాయి వరకూ అవగాహన కల్పించామని పేర్కొన్నారు.

### ఎలక్ట్రిక్ వినియోగంపై చైతన్యం

తెలంగాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు, చమురు, గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని.. పునరుత్పాక విద్యుత్ ఉత్పత్తి పెంచుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్ను పెద్ద ఎత్తున ప్రోత్స హిస్తున్నట్లు సీఎం ఈ సందర్భంగా ప్రధాని మోడీ దృష్టికీ తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకు పైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రిట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇక ముందు అన్ని ఈవీ బస్సులనే వినియోగించనున్నట్లు రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి పాల్గొన్నారు.

# తెలంగాణలో సమృద్ధిగా పెట్రో నిల్వలు

## గణాంకాలు విడుదల చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,మార్చి 27 :**తెలంగాణ రాష్ట్రంలో ఇంధన సరఫరాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా నివేదికను విడుదల చేసింది. మార్చి 27నాటి అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అత్యధికంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టమైంది. సాధారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ అవసరమయ్యే ఇంధన పరిమాణం కంటే మార్చి 26వ తేదీన జరిగిన సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రవాణా రంగం, సామాన్య వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. పెట్రోల్ వినియోగాన్ని పరిశీలిస్తే, రాష్ట్రంలో రోజువారీ సగటు సరఫరా 5,883 కిలో లీటర్లుగా ఉంటుంది. అయితే, మార్చి 26 నాటికి ఏకంగా 16,609 కిలో లీటర్ల పెట్రోల్‌ను సరఫరా చేశారు. అంటే సాధారణ డిమాండ్ కంటే 182 శాతం అధికంగా పెట్రోల్ అందుబాటులో ఉంది. అదేవిధంగా, రవాణా , వ్యవసాయ రంగాలకు అత్యంత కీలకమైన డీజిల్ (ఊ÷ూఆ) సరఫరా కూడా ఆశాజనకంగా ఉంది. రోజువారీ సగటు అవసరం 7,348 కిలో లీటర్లు కాగా, ప్రభుత్వం ఏకంగా 19,580 కిలో లీటర్లను సరఫరా చేసింది. ఇది సాధారణ డిమాండ్ కంటే 167 శాతం ఎక్కువ. మొత్తంగా చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఇంధన అవసరాలు తీర్చడానికి అవసరమైన సగటు 13,231 కిలో లీటర్లు అయితే, ప్రస్తుతం సరఫరా అవుతున్న పరిమాణం 36,189 కిలో లీటర్లుగా నమోదైంది. ఈ గణాంకాలను బట్టి చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, సరఫరా వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని, ఇంధనం కోసం కంగారుపడి బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. 'తెలంగాణ రైజింగ్' లక్ష్యంగా ఇంధన సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

# ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

## 25న పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా

## మేడ్చెల్ మునీరాబాద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా

## శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన



**నిజామాబాద్,మార్చి 27 :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో శ్రీరామనవమి శోభాయాత్ర

### యాత్రను ప్రారంభించిన గవర్నర్ శుక్లా.. బందోబస్తు పర్యవేక్షించిన సిపి సజ్జన్నార్



**హైదరాబాద్,మార్చి 27 :** హైదరాబాద్ నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్రను గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వరకు ఇది కొనసాగనుంది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతీయ సంస్కృతిలో రామాయణం విశిష్టమైందని.. ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడిగా శ్రీరాముడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఐకమత్యం, భక్తి భావనకు శోభాయాత్ర నిదర్శనంగా నిలుస్తోందని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రాములోరి కల్యాణాలు, శోభాయాత్రలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నల్లకుంటలోని పాత రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ మాట్లాడారు. నగరంలో దాదాపు 339 ప్రాంతాల్లో శ్రీరామ నవమి సందర్భంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే శోభాయాత్రకు 3వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. అనుకున్న సమయానికి శోభాయాత్ర పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇతర పండుగలకు ప్రజలు సహకరించిన విధంగానే శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలని సజ్జనార్ కోరారు.

## నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు

### సింఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

**న్యూఢిల్లీ,మార్చి 27 :** నాలుగు రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

## ట్రాన్స్ జెండర్ల బిల్లును వ్యతిరేకించిన జయాబచ్చన్

**న్యూఢిల్లీ, మార్చి 27 :** పార్లమెంట్‌లో ట్రాన్స్‌జెండర్ల హక్కుల సవరణ బిల్లు-2026 ఆమోదం పొందింది. అయితే ఈ బిల్లును సమాజ్‌వాది పార్టీ ఎంపి జయా బచ్చన్ వ్యతిరేకించారు. రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో.. అధికారపక్ష ఎంపీలు అడ్డుకోగా.. ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లుపై ఆమె మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన ఈ కొత్త బిల్లు అశాస్త్రీయంగా ఉంది. ట్రాన్స్‌జెండర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని జయా మండిపడ్డారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్లు తమ గుర్తింపును నిరూపించుకోవడానికి మెడికల్ బోర్డు సర్టిఫికేట్ పొందాలనే నిబంధనను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలు నిజంగా తీరాలంటే వారి వర్గం నుంచే ఒకరిని పార్లమెంట్‌కు నామినేట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఎల్‌బి స్టేడియంలో శాసనసభ్యుల క్రీడోత్సవాలు

### ఏర్పాట్లను పరిశీలించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



**హైదరాబాద్,మార్చి 27 :** ఎల్బీ స్టేడియంలో ప్రారంభం కాబోతున్న శాసనసభ్యుల క్రీడోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. 28 నుంచి ఎల్ బి స్టేడియంలో ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 ఏర్పాట్లను ఆయన స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రీడల పట్ల అవగాహన తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శాసనసభ్యుల క్రీడోత్సవ పోటీలను ఘనంగా నిర్వహించబోతున్నామని, తద్వారా రాష్ట్రంలో క్రీడల పట్ల అవగాహన ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని వినియోగించబోతున్నామని తెలిపారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్న ఈ క్రీడా పోటీలలో పార్టీల భేద భావాలు లేకుండా, అన్ని పక్షాల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు భాగస్వామ్యం కావడం సంతోషకరమని అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్బాల్, క్రికెట్ , అ÷-లథెటిక్స్, కబడ్డీ,వాలీబాల్ బాడ్మింటన్,టేబుల్ టెన్నిస్, తోపాటు కొన్ని రిక్రియేషనల్ క్రీడా పోటీలు నిర్వహించబోతున్నయని తెలిపారు. ఈ పోటీలు వీక్షించడానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పించబోతున్నామని, అందరికీ అవసరమైన సౌకర్యాలను సమకూర్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## గొల్లపల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల,మార్చి 27 :** శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రయాదబద్ధంగా పండితులు కళ్యాణతో÷-వసం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాములోరి కల్యాణోత్సవాలకు హాజరైన సందర్భంగా కేటీఆర్‌కు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు

## నటుడు రాహుల్ రామకృష్ణ కుటుంబంలో విషాదం

### గడ్డి మందు ప్రభావంతో సోదరుడు మృతి

### పారాక్వాట్‌ను నిషేధించాలని రామకృష్ణ బహిరంగ వినతి



**హైదరాబాద్,మార్చి 27 :** ప్రముఖ నటుడు, సినీ రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మరణించారు. ఈ విషాద వార్తను పంచుకుంటూ రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా చేసిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పారాక్వాట్ వంటి ప్రాణాంతక రసాయనాలు మార్కెట్‌లో ఎంత సులభంగా అందుబాటులో ఉన్నాయో వివరించాడు. ఈ విషప్రయోగం వల్ల సంభవించే మరణాల సంఖ్యను చూసి వైద్యులు కూడా దిగ్భ్రాంతికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి బహిరంగ విన్నపం చేశారు. పారాక్వాట్ అనేది చాలా శక్తివంతమైన రసాయనమని, దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడం వల్ల ఇది శరీరంలోకి వెళ్ళిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు మరియు కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం మార్కెట్లలోనే కాకుండా ఈ-కామర్స్ సైట్లలో కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని, దీనిని ఆత్మహత్యలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆయన వివరించారు. ఇలాంటి ప్రాణాంతక మందును తక్షణమే నిషేధించి మరిన్ని ప్రాణాలు పోకుండా కాపాడాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. ఇప్పటికే పలు దేశాల్లో నిషేధానికి గురైన ఈ రసాయనంపై భారత్‌లో కూడా ఆంక్షలు విధించాలనే డిమాండ్‌కు నెటిజన్ల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

## పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి


### దీంతో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి

### పొలాలు, నీరు కలుషితం అవుతున్నాయి

### లోక్‌సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య డిమాండ్



**న్యూఢిల్లీ,మార్చి 27 :** పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సహా తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలువురు వైద్య నిపుణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ముప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు , వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని.. ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.



# అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

## బాలరాముడిపై సూర్యకిరణాలతో తిలకం

## తిలకించి, పులకించిన భక్తజనం

**అయోధ్య :** శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆ÷-టో-మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ఎ÷-లాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

# దేశంలో ఎరువుల కొరత లేదు

## తగినన్ని నిల్వలు ఉన్నాయి ... లోక్‌సభలో జెపి నడ్డా వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలో ఎరువుల కొరత లేదని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సబకు తెలిపారు. దేశంలో అవసరమైన నిల్వలు ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు తగ్గట్టు సరఫరా చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు. ముడిసరకుల దిగుమతి విషయంలో ఒక్క దేశం పైనే ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ విషయంలో ఇప్పటికే అనేక దేశాలతో భారత్ సుదీర్ఘకాలానికి ఒప్పందాలు చేసుకుంది. ఔషధాల తయారీ కోసం ఇతర దేశాల నుంచి ముడిసరకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం అని జేపీ నడ్డా లోక్‌సభలో వివరించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో నిత్యావసరాలు, ఎరువుల సరఫరా గురించి చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఖరీఫ్ సీజన్ వరకూ ఎరువులకు కొరత ఉండదు. కానీ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల వాడకంలో భారత్ రెండో అతిపెద్ద దేశం. ఫెర్టిలైజర్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉంది. ఎల్ఎన్‌జీ ధరల పెరుగదల కారణంగా యూరియా ఉత్పత్తి వ్యయాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. అదే సమయంలో, ఎరువులు, ముడి పదార్థాల రవాణా ఆలస్యం అవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# ఇరాన్‌పై దాడులు తీవ్రం

## జానావాసలపై దాడిలో 26మంది మృతి

**టెహ్రాన్ :** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని ఇస్ఫాహాన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. నివాసాలపై దాడి చేయడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 26 మంది మరణించినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారని పేర్కొంది. గత నెల 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేసింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కష్టాలు మొదలయ్యాయి. ఇక హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. అంతేకాకుండా ఇజ్రాయెల్, అమెరికా మిత్రదేశాలకు చెందిన ఆయిల్ ట్యాంకర్లను విడిచిపెట్టబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో భారీ స్థాయిలో చమురు తెట్టు

## సముద్ర జీవులపై తీవ్ర ప్రభావం

**మెక్సికో :** గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో 600 కి.మీ మేర భారీ స్థాయిలో చమురు తెట్టు ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. చమురు తెట్టు విస్తరించి సముద్ర జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు మెక్సికో అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలతో సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు, ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడం వల్ల ఈ ముప్పు సంభవించిందన్నారు. కొన్ని నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని వెరాక్రూజ్ ప్రాంతంలో సహజంగా చమురు బయటకు వచ్చే పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో లీకైన చమురు నదుల ద్వారా సముద్రంలోకి చేరి, సుమారు 200 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని దాటి మొత్తం 600 కిలోమీటర్ల వరకు వ్యాపించింది. అదనంగా, కాంపెచే బేలోని మరో సహజ చమురు ఊట కూడా నిరంతరం లీక్ అవుతూ కాలుష్యాన్ని మరింత పెంచుతోంది. ఇంకా ?. మూడు నెలల క్రితం సముద్రంలో ఒక చమురు నౌక మునిగిపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించింది. ఈ ఘటనల వల్ల సముద్రంలోని వందలాది చేపలు, సముద్ర తాబేళ్లు వంటి జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే, ప్రకృతి సంరక్షణ ప్రాంతాలు, బయోస్పియర్ రిజర్వులు, జాతీయ పార్కులు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రస్తుతం కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికార సిబ్బంది శుభ్రపరిచే చర్యలు చేపడుతున్నారు.

# టీమిండియా స్ఫూర్తితో ఎదుర్కొందాం





**ఇబ్బందుల్లేకుండా ముందుకు సాగాలి**

**ధరలు పెంచకుండా చర్యలు చేపట్టాం**

**కృత్రిమ మార్కెట్ లేకుండా చూడాలి**

**అన్ని రాష్ట్రాల సీఎంలకు ప్రధాని సూచన**

**పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దిశానిర్దేశం**

**కేంద్రం చర్యలను వివరించిన మోడీ**

**వర్చువల్ సమావేశానికి సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు, యోగి ఆదిత్యనాథ్, భగవంత్ మాన్, భూపేంద్ర పటేల్, ఒమర్ అబ్దుల్లాతో పాటు పలువురు హాజరు**

**రాష్ట్రాల్లో పరిస్థితులను వివరించిన ముఖ్యమంత్రులు**

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో టీమ్ ఇండియా స్ఫూర్తితో ముందుకు సాగుదామని ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల సీఎంలకు సూచించారు. టీమ్ ఇండియా స్ఫూర్తితో ప్రయత్నాలలో సమన్వయం సాధించడమే ఈ వర్చువల్ సమావేశం లక్ష్యమని సమావేశంలో వెల్లడించారు. అమెరికా-ఇజ్రాయెల్ కూటమి ఇరాన్పై జరిపిన దాడితో ఫిబ్రవరి 28న ప్రారంభమైన పశ్చిమ ఆసియా సంఘర్షణపై ప్రధానమంత్రి ముఖ్యమంత్రులతో ఇలాంటి సమావేశం మొదటిసారిగా నిర్వహించారు. దాదాపు రెండు గంటలకు పైగా సాగిన సమావేశంలో కీలక విషయాలను చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రులు ఎన్ చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్), యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్), రేవంత్ రెడ్డి (తెలం గాణ), భగవంత్ మాన్ (పంజాబ్), భూపేంద్ర పటేల్ (గుజరాత్), ఒమర్ అబ్దుల్లా (జమ్మూ కాశ్మీర్), సుఖ్వీందర్ సింగ్ సుఖు (హిమాచల్ ప్రదేశ్), పేమా ఖండూ (అరుణాచల్ ప్రదేశ్)తో పాటు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా కూడా పాల్గొన్నారు. పశ్చిమ ఆసియా సంఘర్షణపై ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ముఖ్యమంత్రులతో సంభాషించి, రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలను సమీక్షించారు. టీమ్ ఇండియా స్ఫూర్తితో ప్రయత్నాలలో సమన్వయం ఉండేలా చూడటంపై ఈ సమావేశంలో కీలకంగా చర్చించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కారణంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఈ సమావేశంలో పాల్గొనలేదు. ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ముఖ్య కార్యదర్శులతో కేబినెట్ సెక్రటేరియట్ ప్రత్యేక సమావేశం నిర్వహించ నుంది. మార్చి 25న, పశ్చిమ ఆసియా పరిస్థితిపై రాజకీయ పార్టీల నాయకులకు వివరించడానికి ప్రభుత్వం అఖిలపక్ష" సమావేశం నిర్వహించింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి ఈ సమావేశంలో ' సవివరంగా వివరించారు. దేశంలో ప్రతి రాష్ట్రం స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను సీఎంలకు ప్రధాని మోదీ వివరించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా, ఇందన ధరలు పెంచకుండా ముందుక ఎ సాగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమానంగా అందిస్తున్న విషయాన్ని కూడా వివరించారని తెలుస్తోంది. గ్యాస్ సరఫరాలో, చమురు కొరతలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లుగా తెలిపారని సమాచారం. అంతేకాదు అన్ని రాష్ట్రాలు కృత్రిమ డిమాండ్ సృష్టించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించా రని తెలుస్తోంది. ఆ మధ్య పశ్చిమ ఆసియా సంఘర్షణ వల్ల ఏర్పడిన క్లిష్టమైన ప్రపంచ పరిస్థితులు చాలా కాలం పాటు కొనసాగే అవకాశం ఉందని ప్రధానమంత్రి అన్నారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో దేశం ఎలా ఐక్యంగా నిలబడిందో. అలాగే ఇప్పుడు కూడా సన్నద్ధంగా, ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సంక్షోభంలోని అంతర్గత భద్రతా కోణంపై కూడా మోదీ సభ దృష్టిని ఆకర్షించారు. ఇలాంటి పరిస్థితులను కొన్ని శక్తులు తమకు అనుకూలంగా మలచుకోవడానికి ప్రయత్నిస్తాయని ఆయన హెచ్చరించారు. అన్ని భద్రతా సంస్థలను అప్రమ త్తం చేశామని, తీరప్రాంత, సరిహద్దు, సైబర్, వ్యూహాత్మక స్థావరాలతో సహా అన్ని రంగాలలో భద్రతను మరింత పటిష్టం చేస్తున్నామని ఆయన అన్నారు. తీరప్రాంత భద్రత, సరిహద్దు భద్రత, సైబర్ భద్రత లేదా వ్యూహాత్మక స్థావరాలు, ఇలా అన్నింటి భద్రతను పటిష్టం చేస్తున్నాం అని ఆయన అన్నారు. ఓర్పు, సంయమనం, అప్రమత్తత పాటించాలని కోరుతూ, అబద్ధాలు అబద్ధాలు ప్రచారం చేయడం, బ్లాక్ మార్కెటింగ్ లేదా నిల్వ చేయడం ద్వారా పరిస్థితిని తమకు అనుకూలంగా మలచుకోవాలని చూసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని మోదీ హెచ్చరించారు. అటువంటి శక్తులపై కఠినమైన పర్యవేక్షణ. తక్షణ చర్యలు తీసుకు నేలా చూడాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

### సమష్టి సంకల్పంతోనే విజయం

దేశ సమష్టి సంకల్పంపై తనకు అచంచలమైన విశ్వాసం ఉందని వ్యక్తం చేస్తూ, తన ప్రసంగంలో ప్రధానమంత్రి, ఈ దేశంలోని ప్రతి ప్రభుత్వం, ప్రతి పౌరుడు కలిసి నడిచినప్ పుడు, మనం ప్రతి సవాలును ఎదుర్కోగలం, ఇదే మన గుర్తింపు, ఇదే మన బలం అని కూడా అన్నారు. అయితే, 140 కోట్ల మంది భారతీయుల సమష్టి కృషితో, ప్రతి విపత్తును ఎదుర్కొంటూ భారతదేశం ముందుకు సాగు తోందని తెలిపారు. భారతదేశం నూతనోత్సాహంతో, నూత న విశ్వాసంతో ముందుకు సాగుతోందని, సవాళ్లను వాయి సే వేయడానికి బదులుగా వాటిని నేరుగా ఎదుర్కొంటోందని మోదీ పేర్కొన్నారు.

# పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం

## పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం

## పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

## సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉ పయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉ న్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

# లాక్ డౌన్ వట్టిమాటే!

## వదంతులు నమ్మొద్దు

## పెట్రోల్, డీజిల్ భారం మోపం

## చమురు కంపెనీలపైనే భారం

## అందుకే ఎక్సైజ్ సుంకం తగ్గింపు

## ప్రపంచమంతటా పెరుగుదల

## కేంద్రమంత్రులు నిర్మల, హర్దీప్ సింగ్



న్యూఢిల్లీ : ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధ ప్రభావం భారత్ పై పడుతోంది. అక్కడి యుద్ధం నేపథ్యంలో నేత భారత్లో లాక్డౌన్ విధించబోతున్నారనే వదంతులు వ్యాపించాయి. వీటిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీస్పం దిస్తూ.. దేశంలో మళ్లీ లాక్డౌన్ను విధించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల్లో భయాందోళనలు పెంచేందుకు కొంత మంది బాధ్యతారాహిత్యంతో, ప్రమాదకర రీతిలో ఇలాంటి వదంతులను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వదంతుల్లో అస్సలు వాస్తవం లేదన్నారు. లాక్డౌన్ అనే ప్రతిపాదనే భారత ప్రభుత్వం పరిశీలనలో లేదని కేంద్ర మంత్రులు తేల్చి చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను యావత్ దేశం బాధ్యతా యుతంగా, ఐక్యంగా, క్రమశిక్షణతో ఎదుర్కోవాలని పిలుపు నిచ్చారు. దేశంలో ఇందన కొరత ఏర్పడిందని, లాక్డౌన్ను విధిస్తారని కొందరు నేతలు చెబు తుండగా విని మేము ఆశ్చర్యపోయామన్నారు. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలే, ఇలాంటి వ్యాఖ్యలను రాజకీయ నేతలు చేస్తుండ టం ఆందోళనకరం. కొవిడ్ తరహాలాక్ డౌ నన్ను ఇప్పుడు విధించే అవకాశమే లేదు. పెరుగుతున్న పె ట్రోలు, డీజిల్ ధరల ప్రభావం ప్రజలపై పడకూడదని మేం కోరుకుంటున్నాం. అందుకోసమే పెట్రోలు, డీజిల్ పై విధించే ఎక్సైజ్ సుంకా న్ని తగ్గించాం. భారత చమురు కంపెనీలపై భారాన్ని తగ్గించేందుకే చేందుకే ఈ చర్యను చేపట్టాం అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారావ సీతారామన్ అన్నారు. గురువారం రాత్రి ప్రధాని మోదీ సారథ్యంలో జరిగిన అత్యవసర సమావేశంలోనే దీనిపై నిర్ణయాన్ని తీసుకున్నాం అని ఆమె చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో లో అనిశ్చితి ఉన్నా, దేశ ప్రజలపై భారం పడకూడదని మోదీ నిర్ణయించారు. ఇప్పుడు భారత చమురు కంపెనీలు భారీ ధరలకు ముడి చమురును కొన్నా, ప్రభుత్వం వాటికి ఆర్థిక మద్దతును అందిస్తుంది. పెట్రోలు, డీజిల్లపై విధించే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తుంది. ఇందుకు ప్రతిగా అవి పెట్రోలు, డీజిల్ ధరలను పెంచడానికి వీల్లేదు. గతంలో ప్రపంచంలో ఎప్పుడు సంక్షోభాలు వచ్చినా భారత్పైనా ఎక్కువ ప్రభావం పడేది, కానీ ఈ సారి ప్రధాని మోదీ సత్వర చర్యలను చేపట్టారని, అందుకే ఇంధన కొరత ఏర్పడటం కానీ, పెట్రోలు, డీజిల్, విమాన ఇంధనం ధరలు పెరగడం కానీ జరగలేదు అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్ పేర్కొన్నారు.

### ఇబ్బందులు లేకుండా చర్యలు :కేంద్ర మంత్రి

పశ్చిమాసియాలోని యుద్ధంతో యావత్ ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ అన్నారు. ఈ నేపథ్యంలో అన్ని పరిణామాలను భారత్ నిశితంగా పరిశీలిస్తోంది. ఇంధన వనరులు, సప్లై చైన్లు, నిత్యావసరాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. దేశ ప్ర జల కు అవసరమైన ఇంధనం, చమురు, ఇతరత్రా కీలక మైన సప్లైలు దెబ్బతినకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని రకాల చర్యలను చేపడుతున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ సర్వసన్నద్ధంగా ఉంది. అంతర్జా తీయ అనిశ్చితులను సమర్థంగా ఎదుర్కొన్న ట్రాక్ రికార్డు భారత్కు ఉంది. ఇకపైనా వాటిని సందర్భోచితంగా, క్రియాశీలకంగా, సమన్వయంతో ఎదుర్కొంటాం అని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు. నాలుగేళ్ల క్రితం రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ప్రధాని మోదీ సారథ్యంలోని ప్రభుత్వం ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటోంది. చమురు ధరల భారాన్ని ప్రభుత్వమే మోస్తూ, దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడుతోంది

# 19వ సీజన్‌కు రంగం సిద్ధం

## నేటి నుంచే ఐపీఎల్-2026





క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నమెంట్ మార్చి 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. భారత్‌లో ఈ టోర్నమెంట్‌ను స్టార్ స్పోర్ట్స్ ఛానెళ్లలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. డిజిటల్ ప్రసార హక్కులను దక్కించుకున్న జియోహాట్‌స్టార్ తమ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో మ్యాచ్‌లను లైవ్ స్ట్రీమింగ్ చేయనుంది. ఈసారి జియోహాట్‌స్టార్‌లో ఇంగ్లీష్, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లోనూ కామెంట్రీ అందుబాటులో ఉంటుంది. అదనంగా బెంగాలీ, భోజ్‌పురి, హర్యానీ భాషల్లోనూ ఫీడ్స్ ఉంటాయి. మొబైల్ యూజర్ల కోసం ప్రత్యేకంగా వర్టికల్ లైవ్ ఫీడ్, 360-డిగ్రీ వ్యూ, మల్టీ-క్యామ్ ఫీచర్లను కూడా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), 2016 విజేత సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. రెండు నెలలకు పైగా క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించనున్న ఈ టోర్నీ మే 31న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. ఈ సీజన్‌లో మొత్తం 12 డబుల్ హెడర్ రోజులు ఉన్నాయి.




డబుల్ హెడర్ ఉన్న రోజుల్లో మొదటి మ్యాచ్ మధ్యాహ్నం 3:30 గంటలకు, రెండో మ్యాచ్ యథావిధిగా రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. సాయంత్రం జరిగే మ్యాచ్‌లకు 7:00 గంటలకు టాస్ వేస్తారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న పది జట్లు గ్రూప్ స్టేజ్‌లో ఒక్కోటి 14 మ్యాచ్‌లు ఆడతాయి. గ్రూప్ స్టేజ్ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్, క్వాలిఫయర్ 2, ఫైనల్ ఫార్మాట్‌లో ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), గుజరాత్ టైటాన్స్ (జీటీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ), ముంబై ఇండియన్స్ (ఎంఐ), పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఈ మ్యాచ్‌లను దేశవ్యాప్తంగా 12 ప్రధాన నగరాల్లో నిర్వహించనున్నారు. ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, హైదరాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, రాయ్‌పూర్, న్యూ చండీగఢ్ నగరాలు ఈ మెగా టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

## అలా ఆడితేనే ధోనీ ఉండాలి.. లేదంటే రిటైర్ అవ్వాలి: అశ్విన్ కీలక వ్యాఖ్యలు




ఐపీఎల్ 2026 సీజన్ షురూ కానుంది. ఈ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టులో మహేంద్ర సింగ్ ధోనీ పాత్రపై మరోసారి ఆసక్తికర చర్చ మొదలైంది. ఈసారి వికెట్ కీపర్-బ్యాటర్ సంజు శాంసన్‌ను సీఎస్‌కే తీసుకోవడంతో ధోనీ భవిష్యత్తుపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో 44 ఏళ్ల ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించవచ్చనే వాదనలు వినిపిస్తుండగా, టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ అభిప్రాయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. ధోనీ ఆడితే తుది జట్టులోనే ఉండాలని, లేదంటే పూర్తిగా తప్పుకోవాలని స్పష్టం చేశాడు. “ధోనీ ఇంపాక్ట్ ప్లేయర్ జాబితాలో ఉండాలనే దానితో నేను ఏకీభవించను. అతను స్క్వాడ్‌లో ఉంటే, తుది జట్టులో కచ్చితంగా ఆడాలి. ఆడటం ఇష్టం లేకపోతే, మొత్తం సీజన్ నుంచి తప్పుకోవాలి. అంతేగానీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటాన్ని నేను సమర్థించను” అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో పేర్కొన్నాడు. ధోనీ ఆడాలని నిర్ణయించుకుంటే, అతన్ని కాదని చెప్పడం సాధ్యం కాదని, గత మూడు నెలలుగా అతను కఠోర సాధన చేయడమే దీనికి నిదర్శనమని అశ్విన్ అన్నాడు. ధోనీ బ్యాటింగ్ నైపుణ్యాల కన్నా, మైదానంలో అతని ఉనికి జట్టుకు ఎంతో కీలకమని అశ్విన్ విశ్లేషించాడు. “ధోనీ ఇప్పుడు సీఎస్‌కేకు టాప్ 6 బ్యాటర్ కాకపోవచ్చు. కానీ, అతను కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు మైదానంలో ఒక దిక్సూచిలా వ్యవహరించగలడు. జట్టులో పెద్దన్న పాత్ర పోషించగలడు. ముఖ్యంగా కొత్త బౌలింగ్ లైనప్‌ను నడిపించడంలో ఫీల్డ్ సెట్ చేయడంలో అతని అనుభవం జట్టుకు చాలా అవసరం” అని వివరించాడు. గత సీజన్‌లో ధోనీ 7 లేదా 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈసారి సంజూ రాకతో బ్యాటింగ్ ఆర్డర్ మరింత బలోపేతం అయింది. దీనివల్ల ధోనీకి బ్యాటింగ్ చేసే అవకాశాలు మరింత తగ్గే అవకాశం ఉందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. “ఈసారి 14 మ్యాచ్‌లలో బహుశా మూడు లేదా నాలుగు సార్లు మాత్రమే ధోనీకి బ్యాటింగ్ చేసే అవకాశం రావచ్చు. మిగతా సమయాల్లో అతను చివరి ఓవర్లలోనే కనిపిస్తాడు. అతని ప్రధాన పాత్ర వికెట్ కీపింగ్, ఫీల్డ్ సెట్టింగ్, రుతురాజ్‌కు సలహాలు ఇవ్వడమే” అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. ఇక, 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ, కేవలం ఐపీఎల్‌లో మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే.

## సొంతగడ్డపై టీమిండియా 2026-27 షెడ్యూల్

### హైదరాబాద్‌లో రెండు మ్యాచ్‌లు

భారత క్రికెట్ అభిమానులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుభవార్త అందించింది. 2026-27 సీజన్‌కు సంబంధించి టీమిండియా స్వదేశంలో ఆడనున్న అంతర్జాతీయ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. ఈ సీజన్‌లో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత్‌లో పర్యటించనున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 17 నగరాల్లో 22 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ షెడ్యూల్‌లో కొన్ని ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. అక్టోబర్ 2024 తర్వాత తొలిసారిగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. అలాగే, ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గౌహతిలోని బర్సపరా స్టేడియం మొదటిసారి ఒక టెస్ట్ మ్యాచ్ నిర్వహించనుంది. షెడ్యూల్ వివరాల్లోకి వెళ్తే, ఈ హోమ్ సీజన్ వెస్టిండీస్ పర్యటనతో ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే ఈ టూర్‌లో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఉంటాయి. వన్డేలకు త్రివేండ్రం, గౌహతి, న్యూ చండీగఢ్ ఆతిథ్యం ఇస్తుండగా.. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరు నగరాలు టీ20 మ్యాచ్‌లకు వేదికలుగా నిలవనున్నాయి. ఆ తర్వాత, డిసెంబర్‌లో శ్రీలంక జట్టు భారత్‌లో పర్యటిస్తుంది. డిసెంబర్ 13 నుంచి 27 వరకు జరిగే ఈ సిరీస్‌లో మూడు వన్డేలు, మూడు టీ20లు ఉంటాయి. వన్డేలు ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్‌లలో జరగనుండగా.. రాజ్‌కోట్, కటక్, పుణేలలో టీ20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. కొత్త ఏడాది ఆరంభంలో, జనవరి 3 నుంచి 9 వరకు జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించి మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లకు కోల్‌కతా, హైదరాబాద్, ముంబై నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దీంతో హైదరాబాద్ నగరానికి ఈ సీజన్‌లో రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు దక్కినట్లయింది. ఈ సీజన్‌కు ప్రధాన ఆకర్షణగా, అభిమానులు ఎంతగానో ఎదురుచూసే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నిలవనుంది. జనవరి 21 నుంచి మార్చి 3 వరకు ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. నాగ్‌పూర్‌లో తొలి టెస్టు ప్రారంభం కానుండగా, ఆ తర్వాత చెన్నై, గౌహతి, రాంచీ, అహ్మదాబాద్‌లలో మిగిలిన మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రపంచంలోని రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య జరిగే ఈ సిరీస్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సుదీర్ఘ షెడ్యూల్ దేశంలోని క్రికెట్ అభిమానులకు అసలైన పండగను తీసుకురానుంది.



## ఐపీఎల్‌కు ముందు కోహ్లీ కొత్త టాటూ

టీమిండియా స్టార్ బ్యాటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆటగాడు విరాట్ కోహ్లీ ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు కొత్త లుక్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచాడు. తన ఎడమ చేతి నిండా సరికొత్తగా ఫుల్ స్లీవ్ టాటూ వేయించుకున్నాడు. ముంబైకి చెందిన ప్రముఖ ‘ఏలియన్స్ టాటూ ఇండియా’ స్టూడియోలో కోహ్లీ ఈ టాటూను వేయించుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆ సంస్థ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా, అది క్షణాల్లో వైరల్‌గా మారింది. రేపటి నుంచి ఐపీఎల్ 19వ ఎడిషన్ ప్రారంభం కానుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనున్న తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. ఈ కీలకమైన టోర్నీకి ముందు కోహ్లీ వేయించుకున్న ఈ టాటూ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ టాటూ వెనుక ఉన్న అర్థాన్ని ఏలియన్స్ టాటూ సంస్థ తమ వెబ్‌సైట్‌లో వివరించింది. “ఇది కేవలం మరో కొత్త టాటూ కాదు. కోహ్లీ వ్యక్తిగా ఎలా ఎదిగాడు, అతని ప్రయాణం ఏంటి అనే లోతైన అర్థాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. అతని జీవితంలోని పరివర్తనకు ఇది అద్దం పడుతుంది” అని పేర్కొంది. జీవితంలోని ప్రతి దశలోనూ క్రమశిక్షణ, ఏకాగ్రత, అచంచలమైన నమ్మకంతో పాత అలవాట్లను, ఆలోచనలను వదిలేశాడని, కొన్నింటిని మరింత బలోపేతం చేసుకున్నాడని, మరిన్ని కొత్త నమ్మకాలను తన వ్యక్తిత్వంలో చేర్చుకున్నాడని తెలిపింది. వాటన్నిటికీ ఈ టాటూ ప్రతీక అని వివరించింది. కోహ్లీ ఎడమ చేయి ఖాళీ కాన్వాస్ కాదని, దానిపై ఇప్పటికే వేర్వేరు దశలకు చెందిన పాత టాటూలు ఉన్నాయని ఆర్టిస్టులు తెలిపారు. వాటిలో కొన్ని కాలక్రమేణా స్పష్టత కోల్పోయాయని, మరికొన్ని ప్రస్తుత అతని వ్యక్తిత్వానికి సరిపోలడం లేదని అన్నారు. అందుకే కొన్ని పాత టాటూలను పూర్తిగా కవర్ చేస్తూ, మరికొన్నింటిని మెరుగుపరుస్తూ, కొత్త ఎలిమెంట్స్‌ను జోడించి ఒకే కథగా చెప్పేలా ఈ ఫుల్ స్లీవ్ టాటూను పూర్తి చేసినట్లు వారు వెల్లడించారు. పాత, కొత్త టాటూల కలయికతో అతని జీవిత ప్రయాణాన్ని తెలిపేలా దీనిని తీర్చిదిద్దినట్లు వివరించారు.

## పీఎస్ఎల్‌లో వింత


### రంగు మారిన బంతి.. నాసిరకం జెర్సీలతో నవ్వులపాలు!





పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 సీజన్ ఆరంభం రోజునే ఒక విచిత్రమైన సంఘటనతో వార్తల్లో నిలిచింది. లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో లాహోర్ ఖలందర్స్, హైదరాబాద్ కింగ్స్‌మెన్ మధ్య జరిగిన ఆరంభ మ్యాచ్‌లో తెల్లటి క్రికెట్ బంతి గులాబీ రంగులోకి మారడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ ఘటనతో లీగ్ నాణ్యతపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో విమర్శలు, సెటైర్లు వెల్లువెత్తాయి. ఆట మధ్యలో ఫీల్డర్లు బంతి మెరుపును కాపాడేందుకు తమ దుస్తులకు రుద్దుతున్నప్పుడు ఈ సమస్య తలెత్తింది. హైదరాబాద్ కింగ్స్‌మెన్ ఆటగాళ్ల జెర్సీలకు వాడిన నాసిరకం మెరూన్ రంగు, తెల్లటి బంతికి అంటుకుంది. దీంతో కొద్దిసేపటికే బంతి పింక్‌గా మారిపోయింది. ఈ దృశ్యాలకు సంబంధించిన క్లిప్పులు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు మీమ్స్, జోకులతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై పాక్ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ తన యూట్యూబ్ ఛానెల్‌లో వ్యంగ్యంగా స్పందించాడు. “హైదరాబాద్ కింగ్స్‌మెన్ తమ కిట్లకు స్థానికంగా ఉండే దుపట్టా రంగుల షాపులో రంగు వేయించుకున్నట్లుంది. అక్కడ తక్కువ ధరకే తెల్ల బట్టలకు రంగులు వేసి ఇస్తారు” అంటూ ఎగతాళి చేశాడు. అభిమానులు కూడా తీవ్రంగా స్పందించారు. “అంతర్జాతీయ లీగ్‌లో ఆడుతున్నారా? లేక గల్లీ క్రికెట్ ప్రయోగం చేస్తున్నారా?”, “డబ్బులన్నీ జట్టును కొనడానికే సరిపోయినట్లున్నాయి” అంటూ కామెంట్లు చేశారు. ఒక అభిమాని అయితే, ఈ రంగు ఆటగాళ్ల చర్మానికి అంటితే చర్మ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ ట్రోలింగ్‌పై హైదరాబాద్ కింగ్స్‌మెన్ ఫ్రాంచైజీ కూడా సరదాగా స్పందించింది. మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ, తమ ప్రత్యర్థి లాహోర్ ఖలందర్స్‌కు అభినందనలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. “పీఎస్ఎల్‌లో జరిగిన తొలి ‘పింక్-బాల్ గేమ్’లో గెలిచినందుకు ప్రత్యర్థి జట్టుకు అభినందనలు” అంటూ సెటైరికల్‌గా పేర్కొంది. ఇదిలా ఉంటే... మ్యాచ్ ప్రసార నాణ్యతపై కూడా ప్రేక్షకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 4కే రిజల్యూషన్ అని ప్రచారం చేసినప్పటికీ, కెమెరాలు షేక్ అవ్వడం, దృశ్యాలు మసకగా కనిపించడం వంటి సమస్యలు తలెత్తాయి. ఆడియో, వీడియో సింక్ కాలేదని చాలామంది ఫిర్యాదు చేశారు. “పేలవమైన కెమెరా వర్క్, బలహీనమైన బ్రాండింగ్, నాసిరకం ఆడియో ప్రొడక్షన్‌తో అభిమానులకు నిరాశే మిగిలింది. మేం ఇంతకంటే మెరుగైన నాణ్యతను ఆశిస్తున్నాం” అంటూ ఒక అభిమాని ఆవేదన వ్యక్తం చేశాడు. మొత్తంగా రంగు మారిన బంతి, సాంకేతిక లోపాలతో పీఎస్ఎల్ ఆరంభం అపశ్రుతులతో మొదలైంది.

## ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును మహిళలు ఇకనైనా ఆపాలి: సమంత

హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మరోసారి తన గళాన్ని బలంగా వినిపించారు. గుర్తింపు పొందాలన్నా, తమను తాము నిరూపించుకోవాలన్నా మహిళలు ప్రతిదానికీ రెట్టింపు కష్టపడాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. మహిళల స్థితిగతులపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకున్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమాజంలో ఇతరుల సౌకర్యం కోసం మహిళలు తమ అభిప్రాయాలను, షెడ్యూళ్లను, చివరికి తమ ఆశయాలను కూడా త్యాగం చేయడం ఒక సాధారణ విషయంగా మారిపోయిందని సమంత పేర్కొన్నారు. తమ వ్యక్తిత్వాన్ని పక్కనపెట్టి ఇతరుల కోసం జీవించడం, వెనక్కి తగ్గడం మహిళలకు అలవాటైపోయిందని అన్నారు. ఈ త్యాగాలను చాలాసార్లు వారే గుర్తించలేని స్థితిలో ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మహిళలకు ఆమె ఒక ముఖ్యమైన పిలుపునిచ్చారు. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా క్షమాపణలు చెబుతుంటారని, ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును ఇకనైనా ఆపాలని సూచించారు. "మనం మన స్థానాన్ని అర్హతతోనే సంపాదించుకున్నాం. కాబట్టి ఎవరైనా ప్రశంసించినప్పుడు దాన్ని గర్వంగా స్వీకరించాలి" అని సమంత అన్నారు. సినిమాల విషయంలో సామ్ మాట్లాడుతూ.. ఒక చిత్రాన్ని 'ఫీమేల్ లీడ్' సినిమా అని ప్రత్యేకంగా ట్యాగ్ చేయాల్సిన అవసరం లేని రోజు రావాలని ఆకాంక్షించారు. మహిళా పాత్రలు కేవలం హీరోకు సహాయపడేవిగా కాకుండా, స్వతంత్రంగా నిలబడేలా శక్తిమంతంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే షూటింగ్ సెట్స్‌లో మహిళల భద్రత అనేది ఒక చర్చనీయాంశంగా కాకుండా పరిశ్రమలో ఒక ప్రాథమిక ప్రమాణంగా మారాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి నటి సెట్‌లో పూర్తి భద్రతా భావంతో పనిచేసే వాతావరణం ఉండాలని సమంత కోరారు.





## కుస్తీ యోధుడిగా రామ్ చరణ్.. అంచనాలు పెంచిన 'పెద్ది' ఫస్ట్ గ్లింప్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. ఆయన కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని అత్యంత రగ్గడ్, మాస్ అవతారంలో చూపించి దర్శకుడు బుచ్చిబాబు సినిమాపై ఆసక్తిని రేకెత్తించారు. ఈ గ్లింప్స్ ప్రారంభంలో వినిపించే 'కుస్తీ అంటే బ్యాట్‌తో బంతికి ఎదురెళ్లే ఆట కాదురా.. ప్రాణంతో చావుకి ఎదురెళ్లే ఆట' అనే సంభాషణ, ఇది కేవలం క్రీడా నేపథ్య చిత్రం కాదని, ఓ యోధుడి జీవన్మరణ పోరాటమని దర్శకుడు చెప్పకనే చెప్పాడు. ఈ పవర్‌ఫుల్ డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కుస్తీ, క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామాలో చరణ్ పాత్ర ఎంతో శక్తివంతంగా ఉండబోతున్నట్టు ఈ గ్లింప్స్ హింట్ ఇచ్చింది. విజువల్స్‌లో రామ్ చరణ్ మేకోవర్ అద్భుతమనే చెప్పాలి. కండలు తిరిగిన శరీరంతో, ఒంటి నిండా మట్టి పూసుకుని, చేతిలో గద పట్టుకుని నడుస్తున్న చరణ్‌ను చూస్తుంటే, 'రంగస్థలం'లోని చిట్టిబాబును మించిన మాస్ అవతార్ అనిపిస్తోంది. ఆయన కళ్లలో కనిపించే పౌరుషం, గంభీరమైన నడక గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. 1980ల నాటి గ్రామీణ వాతావరణాన్ని, కుస్తీ బరిలోని వేడిని తన సంగీతంతో ప్రేక్షకులకు అనుభూతిని కలిగించారు. ప్రస్తుతం ఈ గ్లింప్స్ యూట్యూబ్, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. అభిమానులు చరణ్ కెరీర్‌లో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. చిత్ర బృందం ప్రకటించిన ప్రకారం 'పెద్ది' ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## హిడెన్ ట్యాలెంట్ తో మతి పోగొడుతోన్న నటి!

ట్యాలెంటెడ్ బ్యూటీ కం నటి ఆదా శర్మ గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు నటిగా సెకెండ్ ఇన్నింగ్స్ లో దూసుకుపోతుంది. వైవిధ్యమైన కథ, పాత్రల్ని ఎంచుకుంటూ తనకంటూ సపరేట్ ట్రాక్ ఏర్పాటు చేసుకుంది. అంతేనా తన విలక్షణమైన వ్యక్తిత్వంతోనూ సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంటుంది. ఆమెలో ఓ అద్భుతమైన హిడెన్ టాలెంట్ ఉందని చాలా తక్కువ మందికి తెలుసు. రకరకాల పక్షుల కూతలను అచ్చుగుద్దినట్లుగా అనుకరించడంలో ఆదా శర్మ సిద్ధహస్తురాలు. సాధారణంగా నటీమణులు తమ గ్లామర్ లేదా డ్యాన్స్ వీడియోలను షేర్ చేస్తుంటారు. కానీ ఆదా శర్మ మాత్రం ప్రకృతికి దగ్గరగా ఉంటూ తనలోని ఈ వింత ప్రతిభను తరచుగా ప్రదర్శిస్తుంది. అమ్మడు అడవుల్లోకి లేదా తోటల్లోకి వెళ్ళినప్పుడు అక్కడ ఉండే పిచ్చుకలు, కాకులు ఇతర అడవి పక్షుల శబ్దాలను అత్యంత సహజంగా అనుకరిస్తుంది. ఆమె గొంతు నుండి వచ్చే ఆ శబ్దాలు వింటుంటే? అది మనిషి చేస్తున్నదా లేక నిజంగానే పక్షి కూస్తోందా అనే సందేహం కలగక మానదు. ఈ మిమిక్రీ టాలెంట్ వెనుక ఆమెకు ప్రకృతిపై ఉన్న మక్కువ స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ -చిన్నప్పటి నుండి పక్షుల శబ్దాలను గమనించడం, వాటిని అనుకరించడం తనకు ఇష్టమని తెలిపింది. కేవలం సరదా కోసం చేసే ఈ పని ఇప్పుడు ఆమె అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆమె షేర్ చేసే ఇలాంటి వీడియోలు నిమిషాల్లోనే వైరల్ అవుతున్నాయి . నెటిజన్లను ఆ వీడియోలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆదా శర్మ కేవలం పక్షుల కూతలే కాదు. మార్షల్ ఆర్ట్స్ (మల్లఖంబ్, కలరిపయట్టు) లో కూడా ఆరితేరింది. ఆమెలోని ఈ బహుముఖ ప్రజ్ఞే ఆమెను ఇతర హీరోయిన్ల కంటే భిన్నంగా నిలబెడుతోంది. -ది కేరళ స్టోరీ- వంటి చిత్రాలతో తన నటనలోని సత్తా చాటింది. వ్యక్తిగత జీవితంలో మాత్రం ఇంతటి సరదా మనిషి కావడం విశేషం. ఆమె ప్రతిభను చూసి నెటిజన్లు బహుశా ఆమెకు పక్షుల భాష కూడా అర్థమవుతుందేమో అని సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి వెండితెరపై గ్లామర్ ఒలకబోయడమే కాదు ఇలాంటి అరుదైన కళలతో ప్రేక్షకులను అలరించడం ఆదా శర్మకే చెల్లింది. ప్రకృతిని ప్రేమిస్తూ, మూగ జీవాల పట్ల సానుభూతి చూపిస్తూ ఆమె చేసే ఇలాంటి పనులు ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నాయి. ఆమెలోని ఈ బర్డ్ మిమిక్రీ టాలెంట్ భవిష్యత్తులో ఏదైనా సినిమాలో ఆమె పాత్రకు ఉపయోగపడితే చూడాలని అభిమానులు ఆశిస్తున్నారు. మరి ఈ హిడెన్ ట్యాలెంట్ ను ముందుగా ఏ దర్శకుడు వినియోగించుకుంటాడో చూడాలి.



## దిశా పటానీ అందాలకు ఫ్యాన్స్ ఫిదా

బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం .. వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది.ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది.ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోంది. దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# కనులపండువగా ఇల్లందకుంటలో సీతారాముల కళ్యాణ మహోత్సవం



కరీంనగర్, మార్చి 27: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణలు, తాళాలు, తప్పట్ల నడుమ జరిగిన ఈ మహోత్సవం భక్తులను ఆకట్టుకుంది. కరీంనగర్ జిల్లా మాత్రమే కాకుండా వరంగల్, హనుమకొండ సహా ఇతర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. భద్రాచలం తర్వాత రెండవ అతిపెద్ద కళ్యాణ మహోత్సవంగా పేరుగాంచిన ఈ వేడుక కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్



గౌష్ ఆలం ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించగా, ప్రతి ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా షామియానాలు, చలువ పందిళ్లు, కేడ్లు, కార్పెట్లు ఏర్పాటు చేశారు. తాగునీటి సదుపాయం, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకొని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ రమేష్ బాబు, ఏసీపీ మాధవి, దేవస్థానం ఈవో సుధాకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఊరూరా సీతారాముల కళ్యాణ వైభోగమే

## ఘనంగా వేడుకలు... అన్న ప్రసాద కార్యక్రమాలు

తిమ్మాపూర్, జనతా న్యూస్ : శ్రీ సీతారామ నవమి సందర్భంగా మండలంలోని ఊరూరా సీతారాముల కళ్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని ఆలయాలు సుందరంగా అలంకరించబడి... పెళ్లి పందిళ్లతో వేడుకలకు ముస్తాబు కాగా... శుక్రవారం ఉదయం డప్పు చప్పుళ్ల మధ్య ఎదుర్కోలు ఉత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తమతమ ఇండ్ల నుండి పట్టు వస్త్రాలను, పుస్తె మెట్టెలను, మంచి ముత్యాల తలంబ్రాలను తీసుకువచ్చి కణ్యాదాతలుగా కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయాల అర్చకులు వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముడి కళ్యాణ వేడుక విశిష్టతను వివరించారు. జిలుకర బెల్లం, మంగళ సూత్ర ధారణ, తలంభ్రాల కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామాల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో సీతారాముల కళ్యాణ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించిన అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామాయణ ఘట్టాన్ని కళ్లకు కనిపించినట్లుగా చూపించేందుకు పలు గ్రామాల్లో చిరుతల రామాయణ కార్యక్రమాలు నిర్వహించగా అందరినీ ఆకట్టుకున్నాయి. మండలంలోని పోరండ్ల శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో అర్చకులు కలకుంట్ల శ్రీనివాసాచారి,



శేషాచారి, శ్రీధరాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణ వేడుకల్లో గ్రామ సర్పంచ్ ఆశోద శ్రీనివాస్ దంపతులు, పంచాయతీ కార్యదర్శి తిరుపతి దంపతులు, ఉపసర్పంచ్ నీలం ఓదెలు దంపతులు, మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన కళ్యాణ వేడుకల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దాచారంలో ఘనంగా సీతారాముల కళ్యాణం

## సీతారాములకు పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలు సమర్పించిన సర్పంచ్ బైరా మనసా రాజేందర్.

## అన్నప్రసాద వితరణ ఆనవాయితీని కొనసాగించిన యాంసాని కైలాసం రాజవ్వల కుటుంబ సభ్యులు.



జనత న్యూస్ బెజ్జంకి : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం మండలంలోని దాచారం గ్రామంలో గల రామాలయంలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బైరా మానస రాజేందర్ లు సీతారాములకు పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలు, వెండి ఆభరణాలు సమర్పించారు. అలాగే ప్రతి ఏటా కరీంనగర్ లో స్థిరపడ్డ అదే గ్రామానికి చెందిన వ్యాపారస్తుడు యాంసాని అశోక్ తన సోదరులతో కలిసి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆనవాయితీగా కొనసాగించారు. ఈ సందర్భంగా యాంసాని అశోక్ మాట్లాడుతూ గ్రామం పై మమకారం, రాముల వారిపై భక్తి, తన తల్లిదండ్రులైన కీర్తిశేషులు యాంసాని కైలాసం - రాజవ్వల జ్ఞాపకార్థం ఇట్టి కార్యక్రమాన్ని తన సోదరులతో కలిసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీటి బాల నర్సు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకి జాతర ఆహ్వాన పత్రికను మంత్రి పొన్నంకు అందించిన ఆలయ కమిటీ




జనత న్యూస్ బెజ్జంకి : మార్చి 25 బుధవారం నుంచి, ఏప్రిల్ 4 శనివారం వరకు నిర్వహించే మండల కేంద్రంలో గుట్టపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక ను శుక్రవారం రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్ ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులతో కలిసి హుస్నాబాద్ లో గల మంత్రి కార్యాలయంలో ఆయనకు సమర్పించినట్లు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల నరసయ్య, వార్డు సభ్యులు బొనగం రమేష్ గౌడ్, దేవస్థానం కమిటీ సభ్యులు గుబిరే చంద్రం, నాయకులు పూర్మ నారాయణరెడ్డి, ఐలేని మహేందర్ రెడ్డి, దోనే వెంకటేశ్వరరావు, సంఘ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సుందరగిరిలో కమనీయం.. సీతారాముల కల్యాణం





చిగురుమామిడి,జనత న్యూస్: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన సుందరగిరి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసాచార్యులు, శేషం శ్రీహర్ష ఆచార్యుల ఆధ్వర్యంలో భక్తజనుల సమక్షంలో ఈ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి, వేదమంత్రోచ్చారణల మధ్య మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. ప్రధానంగా జీలకర్ర బెల్లం, తలంబ్రాల కార్యక్రమం భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా సాగింది. కల్యాణం అనంతరం భక్తుల కోసం జంగ మధు, పత్యం వెంకన్న,జంగ భూపాల్ రెడ్డి, నల్లగొని సురేష్, గందె రమేష్‌లు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,గ్రామ సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చొల్లేటి శంకరయ్య,ఉప సర్పంచ్ మెడబోయిన రాజు, ఆలయ ఈవో కొండపర్తి రాజ్ కుమార్, ఆలయ ధర్మకర్తలు శేషం నరసింహచార్యులు, బూర వీరేశం, పూల లచ్చిరెడ్డి, జీల సంపత్, గందె రాజయ్య, ఎలగందుల శారద, ఆలయ రికార్డ్ అసిస్టెంట్ బూట్ల కవిత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తన్మయత్వంతో తరించిన బెజ్జంకి మండలం





జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంతో పాటు , బేగంపేట, వడ్లూరు, గూడెం, లక్ష్మీపూర్ , వీరాపూర్, తోటపల్లి, గాగిల్లాపూర్, దాచారం, కల్లేపల్లి, గుండారం, గ్రామాలలో సీతారాముల కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు , మండలంలోని వివిధ గ్రామాలలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని, ఆయా గ్రామాల సర్పంచులు గ్రామస్తులతో కలిసి సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. కళ్యాణ మహోత్సవానికి గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములకు వస్త్రాలు , ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని , అన్నప్రసాదాన్ని స్వీకరించి సీతారాముల నామస్మరణలో భక్తి పరవశ్యంతో తన్మయత్వంలో తరించిపోయారు.

## ఎక్సైజ్ సుంకం తగ్గించడం శుభవార్త

**మోడీకి కృతజ్ఞతలు తెలిపిన రామచంద్రరావు**

**హైదరాబాద్,మార్చి 27 :** ప్రధాని నరేంద్ర మోడీ శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడం ఒక సాహసోపేతమైన నిర్ణయమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అభివర్ణించారు. దేశ ప్రజలకు తీపి కబురు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగు తున్నప్పటికీ, సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, జనరంజకమైన నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ఏకంగా 'సున్నా' స్థాయికి తగ్గించడం పెట్రోల్‌పై కూడా రూ. 10 భారాన్ని తగ్గించి కేంద్రం తన బాధ్యతను చాటుకుందని తెలిపారు. ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను ఎప్పుడు నెరవేరుస్తుందని రాంచందర్ రావు ప్రశ్నించారు.

## ఇరాన్‌పై దాడులు నిలిపివేయాలి

**దౌత్యమార్గాలరు కేంద్రం పరిశీలించాలి**

**జమ్మూకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా**

**శ్రీనగర్,మార్చి 27 :** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులను జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు మహమ్మద్ యూసుఫ్ తరిగమి తీవ్రంగా ఖండించారు. ఈ సంఘర్షణను తక్షణమే నిలిపివేసి దౌత్య మార్గాల్లో పరిష్కారం కనుగొనాలని ఇద్దరూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీతో పాటు ఇతరుల హత్యలను ప్రస్తావిస్తూ, యుద్ధ విధానాన్ని సమర్థించలేమని స్పష్టం చేశారు. పిల్లలు సహా పౌరుల ప్రాణనష్టం, యుద్ధ ప్రభావాలు అసహ్యకరమని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల వెనుక ప్రకటించిన లక్ష్యాలపై ప్రశ్నలు లేవనెత్తిన అబ్దుల్లా, యుద్ధ ప్రభావాలు జమ్మూ కాశ్మీర్‌లో కూడా కనిపిస్తున్నాయని తెలిపారు. ఇరాన్‌లో కొంతమంది భారతీయులు చిక్కుకుపోయారని, పెట్రోల్ పంపుల వద్ద పొడవైన క్యూలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను ప్రభావితం చేసే అంశాలపై చర్చించేందుకు అసెంబ్లీకి పూర్తి హక్కు ఉందని అన్నారు. ఇదే విషయంపై స్పందించిన మహమ్మద్ యూసుఫ్ తరిగమి, సంఘర్షణను ముగించడంలో కేంద్రం చురుకైన, నిర్మాణాత్మక పాత్ర పోషించాలని కోరారు. ఇరాన్‌తో భారతదేశానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేస్తూ, దేశవ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక స్వరాలు వినిపించాలని సూచించారు. పరిస్థితిని శాంతింపజేయడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## భర్తను చంపి పూడ్చిపెట్టిన భార్య

**నాలుగు నెలల తరవాత బయటపడ్డ హత్య**

**పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన భార్య**

**అనంతపురం ,మార్చి 27 :** జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కల్యాణదుర్గం మండలంలోని పాతచెరువు గ్రామంలో ఓ భార్య తన భర్తను హత్య చేసి అతని మృతదేహాన్ని ఇంటి ముందే పాతిపెట్టిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతుడు హనుమంతుగా గుర్తించగా, నిందితురాలు అతని భార్య సుకన్యగా పోలీసులు తెలిపారు. ఈ ఘటన నాలుగు నెలల క్రితమే జరిగినప్పటికీ, తాజాగా తల్లీకూతుళ్ల మధ్య జరిగిన గొడవ కారణంగా ఈ దారుణం బయటపడింది. కుటుంబ సభ్యుల మధ్య వివాదం పెరగడంతో విషయం వెలుగులోకి వచ్చి, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. నిందితురాలు సుకన్య స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, భర్త హనుమంతుడు అనుమానంతో తరచూ వేధించేవాడని, అందుకే అర్ధరాత్రి సమయంలో రోకలిబండతో తలపై కొట్టి హత్య చేసినట్లు సుకన్య అంగీకరించినట్లు తెలుస్తోంది. పోలీసులు ఈ కేసులో పూర్తి వివరాలను తెలుసుకొనేందుకు విచారణ కొనసాగిస్తున్నారు. భర్త హనుమంతు గొర్రెలు కాసుకుంటూ జీవనం చేసేవాడని, వీరికి ఒక కొడుకు సందీప్, ఒక కూతురు అమృత సంతానం ఉన్నారని భార్య తెలిపింది. సుకన్యకు ఎవరితోనో అక్రమ సంబంధం ఉందని, అందువల్ల భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవని సమాచారం. కొడుకు కూడా గొర్రెలు కాస్తుంటాడు. కూతురు కళ్యాణదుర్గం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నది. వీరి తండ్రిని చంపిన విషయం బయట ఎక్కడైనా చెబితే నిన్ను కూడా చంపుతానని సుకన్య తన కూతురును బెదిరించింది. అయితే ఈ అమ్మాయి తన తాతగారి ఊరు అనిమిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లడంతో, హత్య చేసిన విషయం అక్కడ చెబుతుందేమోనని నేడు కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ కు వచ్చి సుకన్య నా భర్తను చంపి పూడ్చిపెట్టినానని చెప్పి పోలీస్ స్టేషన్ లో లొంగిపోయింది.

## రామనవమి, రామ్‌చరణ్ బర్త్‌డే

**చిరంజీవి ఇంట్లో హోమం**



**హైదరాబాద్,మార్చి 27 :** మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో హోమం జరిగింది. శ్రీరామనవమి, రామ్ చరణ్ పుట్టిన రోజులను పురస్కరించుకుని చిరు తన ఇంట్లో హోమం ఏర్పాటు చేశారు. చరణ్‌తో హోమం చేయించారు. చిరంజీవి, సురేఖ దంపతులు దగ్గరుండి హోమం ఏర్పాట్లు చూసుకున్నారు. ఈ విషయాన్ని స్వయంగా మెగాస్టార్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో శుక్రవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'శ్రీరామజయం.. ఆ శ్రీరాముని అడుగుజాడల్లో నడిస్తే మనదే విజయం. ఈ ఏడాది శ్రీరామనవమి రోజు యాదృచ్చికంగా చరణ్ బాబు పుట్టినరోజు కలిసి రావడం ఎంతో సంతోషం. ఆ శ్రీరామచంద్రుని ఆశీస్సులతో పాటు.. రాముని చరణాల వద్ద తేజోరూపుడై కొలువుండే మా ఇలవేల్పు హనుమంతుని ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుతూ.. అందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు.. జై శ్రీరామ్...!' అని రాసుకొచ్చారు. చరణ్ హోమం చేస్తున్న వీడియోను కూడా షేర్ చేశారు. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాలో హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తుండగా చరణ్ ప్రమాదానికి గురయ్యారు. ఆయన కంటికి గాయం అయింది. నాలుగు కుట్లు పడ్డాయి. గాయం మానకముందే చరణ్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొన్నారు. ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేశారు. చరణ్ కంటికి బ్యాండేజీతో షూటింగ్ స్పాట్ దగ్గరకు వచ్చిన దృశ్యాల తాలూకా వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కరీంనగర్‌లో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహణ





కరీంనగర్, మార్చి 27: శ్రీరామ నవమి సందర్భంగా కరీంనగర్ నగర వ్యాప్తంగా శుక్రవారం పలు ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. పలు హనుమాన్ దేవాలయాలు, రామాలయాల్లో జరిగిన ఈ వేడుకల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ప్రధానంగా తీగలగుట్టపల్లి కోదండ రామాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్, సీపీ గౌస్ ఆలం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మేయర్ సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఇదిలా ఉండగా దుర్శేడ్, బొమ్మకల్, లక్ష్మీనగర్, రామచంద్రాపూర్ కాలనీ, గోదాంగడ్డ, మార్వాడి దేవాలయం తదితర ప్రాంతాల్లో కూడా సీతారాముల కళ్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. మేయర్ ఈ ప్రాంతాల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నగర వ్యాప్తంగా జరిగిన వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కోదండ రాముని ఆశీస్సులు నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. నగర ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలుపుతూ, శ్రీరాముడి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండి ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు. నగరపాలక సంస్థ నూతన పాలకవర్గానికి ప్రజలకు మెరుగైన సేవలు అందించే శక్తి ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాదవేణి లావణ్య, భూపతి రవీందర్, మేకల వెంకటేష్, చొప్పరి జయశ్రీ వేణు, దేవసాని సరస్వతి తదితర కార్పోరేటర్లు, భక్తులు పాల్గొన్నారు.

## "ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0"లో భారీ సైబర్ ముఠా గుట్టురట్టు

కరీంనగర్, మార్చి 26: సైబర్ నేరాలకు సహకరిస్తూ అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్న 'మ్యూల్ బ్యాంక్ ఖాతాల' నెట్‌వర్క్‌ను కరీంనగర్ పోలీసులు ఛేదించారు. "ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0"లో భాగంగా నిర్వహించిన దర్యాప్తులో మొత్తం 24 మంది నిందితులను గుర్తించగా, అందులో 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా ద్వారా సుమారు రూ.138 కోట్ల భారీ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. రత్నాకర్ బ్యాంక్ (=దీూ) మరియు ఇతర వర్చువల్ ఖాతాల ద్వారా ఈ అక్రమ వ్యవహారాలు సాగినట్లు గుర్తించారు. నిందితులపై భారత న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్ 112, 318(4)తో పాటు ఐటీ చట్టం 66-ఐ కింద కేసులు నమోదు చేశారు.





**నేర విధానం:**

ఈ ముఠా సమన్వయకర్తలు, మధ్యవర్తులు, ఖాతాదారులుగా విభజించుకుని ప్రణాళికాబద్ధంగా పనిచేసింది. మధ్యవర్తులు సాధారణ ప్రజలను ఆకర్షించి వారి పేర్లతో బ్యాంక్ ఖాతాలు తెరిపించగా, ఖాతాదారులు తమ ఖాతాలను నేరగాళ్లకు అప్పగించారు. ఈ ఖాతాల ద్వారా సైబర్ మోసాల డబ్బును విదేశాలకు మళ్లించినట్లు పోలీసులు తెలిపారు.

**అరెస్ట్ అయిన నిందితులు:**

బండారి సాయిరాం, అనుమాండ్ల రంజిత్, అలిగేటి మల్లేశం, బోగ రాకేష్, బండి ప్రణయ్, భువనగిరి కళ్యాణ్ (బ్యాంక్ మేనేజర్), అయేషా బేగం, విభూది రాంకుమార్, నతర్ల శ్రీనివాస్, కర్రే రాజు, కల్లెడ మహేందర్, కొండ్ర నరహరి, కల్లెడ రాజేష్.

**లావాదేవీలు:**

వర్చువల్ ఖాతాల ద్వారా: రూ.12.25 కోట్లు

RBL బ్యాంక్ మ్యూల్ ఖాతాల ద్వారా: రూ.125.80 కోట్లు

మొత్తం: సుమారు రూ.138 కోట్లు

**ప్రజలకు హెచ్చరిక:**

చిన్న మొత్తాల కోసం తమ బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు లేదా లాగిన్ వివరాలు ఇతరులకు ఇవ్వవద్దని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. తెలియని వ్యక్తులకు ఖాతాలు తెరిచి ఇస్తే చట్టపరంగా నేరస్థులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. తదుపరి దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు తెలిపారు.

## చికెన్ ప్రియులకు షాకింగ్ న్యూస్

**భారీగా కుళ్లిన చికెన్ పట్టివేత**

**హైదరాబాద్,మార్చి 27 :** సిటీలో చికెన్ తినే వారికి షికింగ్ న్యూస్. కోల్డ్ స్టోరేజ్ లో గట్టిగా గడ్డ కట్టి.. బూజు పట్టి.. కుళ్లిపోయిన పరిస్థితిలో షాపులకు చేరుతోంది.శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో దొరికిన చికెన్ చూస్తే షాకవ్వాల్సిందే. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను స్థానిక విక్రేతలకు సరఫరా చేస్తున్న ఒక వ్యక్తిని హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందం అరెస్ట్ చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు, హెచ్-ఫాస్ట్ బృందం వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కె. నాగార్జునతో కలిసి మూసాపేట సమీపంలోని భరత్ నగర్, జింకలవాడ వద్ద ఉన్న 'మెసర్స్ ఎస్.పి.ఆర్ చికెన్' ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను గుర్తించారు. దీనిని స్థానిక హోటళ్లు, చికెన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనకు సంబంధించి సూరజ్ పాల్ (66), అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కూకట్‌పల్లి రాజీవ్ గాంధీ నగర్ లో నివాసం ఉండే పాల్ చికెన్ హోల్ సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కోల్డ్ స్టోరేజ్ సెంటర్ నుంచి సుమారు 352 కిలోల గడ్డకట్టిన కుళ్ళిన చికెన్ స్వాధీనం చేసుకున్నారు. అందులో రెక్కలు, చెస్ట్, లివర్, గిజార్డ్ వంటి భాగాలు స్వాధీనం చేసుకున్నారు. చికెన్ నిల్వ ఉంచిన ప్రాంగణం అత్యంత అపరిశుభ్రంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈఃూంఎ లైసెన్స్ గడువు ముగిసినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి నిర్వహిస్తున్నారు. నిల్వ చేసిన మాంసం తినడానికి యోగ్యమైనది కాదని తెలిపారు. హెచ్-ఫాస్ట్ బృందం స్వాధీనం చేసుకున్న మాంసాన్ని, నిందితుడిని సనత్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో హెచ్-ఫాస్ట్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, సనత్ నగర్ పోలీసులు పాల్గొన్నారు.

## దేశీయ విమానయానరంగం భద్రత

**పార్లమెంటరీ ప్యానల్ తీవ్ర ఆందోళన**

న్యూఢిల్లీ,మార్చి 27(ఆర్ఎన్ఎ): దేశంలోని పౌర విమానయాన రంగంలో భద్రతపై పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ తాజాగా వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించామని, తరచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొన్నది. జనవరి 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా.. 377 విమానాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆడిట్ చేసిన వాటిలో ఇండిగో విమానాల సంఖ్యే ఎక్కువని.. లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. ఫిబ్రవరి మూడు వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా.. 148 ఫ్లైట్లలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నది. కొన్ని లోపాలు రిపీట్ అయ్యాయని తెలిపింది. 166 ఎయిరిండియా, 101 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టారు. వాటిల్లోనూ లోపాలు వెలుగు చూశాయి. దాదాపు సగం ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నాయి. ఈ స్థాయిలో లోపాలు వెలుగు చూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గత ఏడాది అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్‌ను కూడా నివేదిక ప్రస్తావించింది. ఆ ఆడిట్‌లో దాదాపు 100 భద్రతాలోపాలను గుర్తించారు. అందులో 7 ఉల్లంఘనలు లెవెల్-1కి సంబంధించినవని, వాటివల్ల తీవ్ర ముప్పు పొంచి ఉండటంతో వెంటనే వాటిని సరిచూసుకోవాలని ఎయిరిండియాకు డీజీసీఏ సూచించింది. విమానాల మోడళ్లను బట్టి శిక్షణ విషయంలో వ్యత్యాసాలు ఉండటాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ప్రస్తావించింది. 2025 చివరి నాటికి భద్రతా ఉల్లంఘనలకు సంబంధించి 19 నోటీసులను విమానయాన సంస్థలకు డీజీసీఏ జారీ చేసింది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com